ప్రజాశక్తి

ఆదివారం 23 జూన్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న గొట్టిపాటి రవికుమార్

సామూహిక అత్యాచారం.. ఆపై హత్య!

- సుచరితపై గంజాయి, మద్యం మత్తులో అఘాయిత్యం
- ముగ్గురు నిందితుల అరెస్టు
- ఎస్‌పి వకుల్‌జిందాల్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

చీరాల, ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం రేకెత్తించిన సుచరిత హత్య కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. నిందితులు సామూహిక అత్యాచారం చేసి.. హతమార్చినట్లు తేల్చారు. గంజాయి, మద్యం మత్తులో నిందితులు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని పోలీసులు చెప్పారు. ముగ్గురు నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ కేసు వివరాలను వెల్లడించారు.

ఈపురుపాలెం గ్రామంలోని సీతారాం పేటకు చెందిన పి.సుచరిత (21) శుక్రవారం వేకువజామున తమ ఇంటి సమీపంలోని రైలు పట్టాల వద్దకు బహిర్భూమికి వెళ్లింది. గంజాయి, మద్యం మత్తుకు బానిసలైన, అదే గ్రామానికి చెందిన దేవరకొండ విజయ్, కారంకి మహేష్ రైల్వే ట్రాక్ సమీపంలో మద్యం సేవిస్తున్నారు. అటుగా వచ్చిన సుచరితను ఇద్దరు నిందితులు బలవంతంగా చెట్లపొదల్లోకి తీసుకెళ్లారు. నోరుమూసి బలవంతంగా అత్యాచారం చేశారు. అనంతరం ముఖంపై దాడి చేసి నోరు, ముక్కు మూసి హత్య చేశారు. ఈ నేరం చేసిన తరువాత దేవరకొండ శ్రీకాంత్ వారికి సహకరించాడు. దేవరకొండ విజయ్‌పై చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ పాటికే పలు కేసులు నమోదై ఉన్నాయి. అందులో ఒకటి మర్డర్ కేసు. ఇతని మీద చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ కూడా ఉంది. అలాగే దేవరకొండ శ్రీకాంత్ మీద చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. అందులో ఒక హత్య కేసు, మరొక హత్యాయత్నం కేసు ఉన్నాయి. ఇతని మీద చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. హతురాలి తల్లి పంజుల కామాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు బృందాలతో కేసును చేదించినట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ పది ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి.. 48 గంటలలోపు నేరానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేశామన్నారు. అన్ని రకాల సాక్షాధారాలను సేకరించి సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులు మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై ఉద్దేశపూర్వకంగా యువతిపై అత్యాచారం చేసి హతమార్చారని చెప్పారు. జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేసును అడిషనల్ ఎస్‌పి విఠలేశ్వరరావు, చీరాల డిఎస్‌పి బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో చీరాల రూరల్ సిఐ నిమ్మగడ్డ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేసినట్లు చెప్పారు. శనివారం సాయంత్రం 7 గంటలకు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. న్యాయస్థానంలో ముద్దాయిలపై అభియోగ పత్రం దాఖలు చేసి, ముద్దాయిలకి కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.


విద్యుత్ శాఖ అధికారులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- దేశంలోనే ఉత్తమ విద్యుత్ శాఖగా తీర్చిదిద్దుతా..
- బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా ఆయన శనివారం అమరావతి సచివాలయ రెండో బ్లాక్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తూ తొలి సంతకం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు సంబంధించిన దస్త్రంపై రెండో సంతకం చేశారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికీ మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించే కార్యక్రమానికి సంబంధించిన దస్త్రంపై మూడో సంతకం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. తనకు విద్యుత్ శాఖ మంత్రిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ▶ 2లో



మంత్రి స్వామిని సన్మానిస్తున్న దృశ్యం

మంత్రి స్వామికి పౌర సన్మానం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి.బాలవీరాంజనేయస్వామికి శనివారం రాత్రి పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యని కూడా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెల్లం జయంతిబాబు, టిడిపి నాయకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు

ప్రకాశం, బాపట్ల కలెక్టర్ల బదిలీ

- 'ప్రకాశం' కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా
- బాపట్ల ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా జేసీకి బాధ్యతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, బాపట్ల జిల్లా

ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా బదిలీ అయ్యారు. కలెక్టర్ దినేష్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌గా శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న తమీమ్ అన్సారియాను నియమిస్తూ ▶ 2లో



తమీమ్ అన్సారియా

'దామచర్లకు' ఘన స్వాగతం

- పూలవర్షం కురిపించిన తెలుగు మహిళలు



దామచర్లను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకి టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎమ్మెల్యే దామచర్లపై తెలుగు మహిళలు పూల వర్షం కురిపించారు. కర్నూల్ రోడ్డు నుంచి మినీ స్టేడియం వరకు సాగిన ర్యాలీలో ప్రతి సెంటర్‌లో టిడిపి శ్రేణులు భారీ గజమాలలతో దామచర్ల జనార్ధనరావుకి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దామచర్ల విజయోత్సవ ర్యాలీ శనివారం ఒంగోలు నగరంలో ఉత్సాహంగా సాగింది. అసెంబ్లీలో ఒంగోలు ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన తరువాత తొలిసారి ఒంగోలు నగరానికి వచ్చిన దామచర్ల జనార్ధనరావుకి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. విజయోత్సవ ర్యాలీ ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ఒంగోలు నగరానికి చేరుకున్న ఎమ్మెల్యే దామచర్లకు స్థానిక కర్నూలు రోడ్డు బైపాస్ వద్ద తెలుగు మహిళలు దామచర్లపై పూల వర్షం కరిపించారు. ఓపెన్ టాప్ జీపుపై ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ నిలబడి ప్రజలకు అభివాదం చేసి ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సతీమణి నాగసత్యలత, కుమార్తెలు అనీషా లక్ష్మి, తనీషా లక్ష్మి, టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, వైవి సుబ్బారావు, శింగరాజు రాంబాబు, వి.శేషంరాజు, వై.శశికాంత్ భూషణ్, కామేపల్లి శ్రీనివాసరావు, మండవ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎల్ఐసిఏఓఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శుల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో ఎల్ఐసి ఏజెంట్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసిఏఓఐ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి కోటేశ్వరరావు, జి రవి కిషోర్ డిమాండ్ చేశారు. ఎల్ఐసిఏఓఐ నెల్లూరు డివిజన్ కమిటీ సమావేశం ఒంగోలు ఎల్ఐసి జిల్లా కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వర రావు, రవి కిషోర్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ఎల్ఐసి ఏజెంట్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారని, తద్వారా వారు రిటైరైన తర్వాత పెన్షన్ సౌకర్యం ఉందన్నారు. ఏజెంట్ల పిల్లలకు స్కాలర్ షిప్ వసతి కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూడా కొత్తగా ఏర్పడిన తెలుగు దేశం ప్రభుత్వం ఎల్ఐసి ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి సంస్థను బలహీనపరిచే చర్యలను కేంద్రం ప్రభుత్వం ఉప సంహరించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ పరిమితి రూ.25 లక్షలకు పెంచాలని కోరారు. 65 సంవత్సరాల పరిమితి ఎత్తివేయాలని వారు కోరారు. గ్రాట్యుటీపై ఉన్న సీలింగ్‌ను ఎత్తివేయాలని, గ్రాట్యు టీ లెక్కింపులో వున్న అశాస్త్రీయ పద్ధతిని మార్చాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం పోరాటాలను రూపొందిస్తా మని, ఈ పోరాటాలలో ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె రాజశేఖర్, నెల్లూరు డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బెజవాడ శివయ్య, సిహెచ్ నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి వెంకట్రావు, నాయకులు ధనుంజయ, కె వెంకటేశ్వర్లు, ఎం నరసింహారావు, కె బాలచంద్రం, కె రామకోటి రెడ్డి, సిహెచ్‌వి సుబ్బారెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, ఎన్ బసవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏజెంట్ల ఆర్గనైజేషన్ నాయకుడు

విద్యుత్ శాఖ అధికారులు
ప్రజలకు మెరుగైన సేవలందించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రీతిలో విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యుత్ సరఫరా, డిమాండులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబు నాయుడని పేర్కొన్నారు. ఆయన తీసుకొచ్చిన్న విద్యుత్ సంస్కరణలు మరెవరూ తీసుకురాలేదని అన్నారు. దేశంలోనే ఉత్తమ విద్యుత్ శాఖగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖను తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా ప్రయత్నం చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వం విద్యుత్ శాఖను నిర్వీర్యం చేయడమే గాక తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే వి నరేంద్రవర్మ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పలువురు ఇతర ప్రజాప్రతినిధులు, పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకాశం, బాపట్ల కలెక్టర్ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ప్రస్తుత జేసీ శ్రీధర్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ 2022 సంవత్సరంలో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్‌గా రెండేళ్ల పాలనను దినేష్ కుమార్ ఇటీవల పూర్తి చేసుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త కలెక్టర్‌గా నియమితులైన తమీమ్ అన్సారియా 2-3 రోజుల్లో విధుల్లో హాజరయ్యే.. అవకాశాలున్నాయి.

జంతువులను హింసించరాదు: డాక్టర్ బేబీ రాణి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

జంతువులను ఒకచోట నుంచి మరొక చోటకు తరలించేటప్పుడు వాటిని హింసించకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని తరలించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కే బేబీ రాణి అన్నారు. మండలంలోని పేర్నమిట్ట పశు వైద్యశాలలో శనివారం సాయంత్రం జరిగిన పశు సంరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ వీధుల్లో సంచరించే పశువులకు మనుషులతో సమానంగా చూడాలని వాటికి మంచినీరు, మేత అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. శుభ అశుభ కార్యక్రమాల సమయంలో జంతువులను వధించరాదని అన్నారు. జంతువులకు సరిపడా మేత నీటిని అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. జంతు సంరక్షణ చట్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో డిఎల్‌డిఏ డాక్టర్ ఎస్‌కే కాలేషా పేర్నమిట్ట పశువైద్యాధికారి డాక్టర్ పి చిరంజీవి, పశు వైద్య సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిజె బృందం పర్యటన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కారం కోసం మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఈ నెల 15వ తేదీ నుంచి జులై 15 వరకు నిర్వహిస్తున్న మాసోత్సవం సందర్భంగా శనివారం మార్కాపురం పట్టణంలోని పలు వీధుల్లో క్షేత్రస్థాయిలో ఎంపీజే బృందం పర్యటించింది. చదువు మానుకొని పనులకు వెళ్లే పిల్లలను పాఠశాలలకు పంపించాలని వారు తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు ప్లే గ్రౌండ్, తగిన వసతులు లేకపోయినా ఫీజులు అధికంగా వసూలు చేస్తూ ప్రజలపై భారం వేస్తున్నా అధికారులు మిన్నకుండి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీలతో మేయర్, కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్: 'నేను బడికి పోతా' కార్యక్రమం ద్వారా బడిఈడు ఉన్న పిల్లలంతా 100 శాతం బడిలో చేరేలా సచివాలయ ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్, వార్డ్ ఉమెన్, వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీలు కృషి చేయాలని నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం జస్వంతరావు కోరారు. ఒంగోలు నగర పరిధిలోని 70 వార్డు సచివాలయ సెక్రటరీలతో శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో వారు సమావేశం నిర్వహించారు. సచివాలయ సెక్రటరీలు ఇంటింటికీ తిరిగి బడిఈడు పిల్లలంతా బడికి వెళ్లేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కోరారు. వచ్చే నెల 12వ తేదీ లోపు బడిమానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. ఒంగోలు మండల విద్యాశాఖాధికారి కిషోర్‌బాబు పాల్గొని నేను బడికిపోతా కార్యక్రమంలో పిల్లలను ఎలా నమోదు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల మండలం వాగుమడుగులో కొలువైన పోలేరమ్మ దేవత తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి అమ్మవారికి నిలుపు ఉత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రతి ఏటా ఏరువాక పౌర్ణమి రోజున ఈ తిరుణాలను జరుపుకోవడం ఆనవాయితీ. తిరుణాల సందర్భంగా శనివారం రాత్రి నాలుగు వైసిపి, రెండు టిడిపి లకు చెందిన విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ తిరునాళ్లకు కొనకనమిట్ల మండలంతో పాటు దొనకొండ, మార్కా పురం, తర్లుపాడు, దర్శి, పొదిలి, కురిచేడు మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దర్శి డీఎస్‌పి అశోక్‌వర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో పొదిలి సిఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మాధవరావు తెలిపారు.

ప్రజాశక్తి
ఆదివారం 23 జూన్ 2024

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దముప్పళ్లపాడు గ్రామంలో ఏరువాక పౌర్ణమి, రైతు మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. తొలుత మహిళా రైతులు ట్రాక్టర్‌ను పూజించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ స్వామినాదన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలన్నారు. కనీస మద్దతు ధరకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని కోరారు. రైతుకు నెలకు రూ.10 వేల వంతున పెన్షన్లు ఇవ్వాలన్నారు. ట్రాక్టర్లకు డీజిల్ 50 శాతం రాయితీపై అందించాలని డిమాండ్ చేశారు. సాగు సాయం క్రింద ఎకరాకు రూ.15 వేల రూపాయలు తెలంగాణ తరహాలో అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన వ్యవసాయ ఖర్చుల దృష్ట్యా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను సవరించి మూడు లక్షల లోపు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. ఐదు లక్షల లోపు పావల వడ్డీ కింద రుణాలు అందించాలన్నారు. కౌలు, రైతులకు కౌలు కార్డులను మంజూరు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలన్నారు. అన్ని రకాల ప్రభుత్వ పథకాలు రైతులకు అందేలా చూడాలన్నారు. ఎరువులు విత్తనాలు,వ్యవసాయ పనిముట్లు 90శాతం సబ్సిడీపై అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. కృష్ణానది జలాల సమస్యలు పరిష్కరించి,పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నికరజలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం కనిగిరి నియోజకవర్గ గుజ్జుల బాలిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జిపి.రామారావు, ఎఐటియుసి నాయకుడు ఖాసింవలి, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్. పవన్ కళ్యాణ్, రైతు సంఘ నాయకులు ఆర్.రామయ్య నాగేశ్వరరావు, రాజ్యం, గుండాబత్తిన రమణయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టా సుబ్బారావు, రాచూటి సిద్దయ్య, రాచూటి ధనలక్ష్మి, రాచూటి చిన్న బ్రహ్మయ్య, రాచూటి పెద్ద బ్రహ్మయ్య, రాచోటికి రంగమ్మ,రాచూటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఏరువాక రైతు మహోత్సవ ప్రారంభంలో నాయకులు

విద్యా కిట్లు అందజేత

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత స్థానాలు సాధించాలని సిఎస్‌పురం గ్రామ సర్పంచి శ్రీరాం పద్మావతి, ఎంఇఒ- 2 రాజాల కొండారెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతున్న విద్యార్థులకు శనివారం విద్యా కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖాదరున్నీసా బేగం, ఎంపిటిసి మన్నేపల్లి పెద్దన్న, మాజీ వైస్ ఎంపిపి బొబ్బూరి రమేష్, పఠాన్ ఖాజా, సంగిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు : మండల పరిధిలోని సీతా రాంపురం జడ్‌పి హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు విద్యా కిట్లు శనివారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఎంపీటీసీ శోభారాణి, విద్య కమిటీ చైర్మన్, టిడిపి గ్రామ అధ్యక్షుడు సానికొమ్ము వెంకటేశ్వర్ల రెడ్డి, దొడ్డిచింతల సర్పంచి సానికొమ్ము బ్రహ్మారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కందుల వెంకటసుబారెడ్డి, వెంకటరామిరెడ్డి ,కనకరాజు ,జిలాని, మురళి ,బాషా,మస్తాన్ ,ప్రభుదాసు, వెంకటేశ్వర్ల రెడ్డి ,నూనె వెంకటనారాయణ, దేవిరెడ్డి సతీష్ కుమార్‌రెడ్డి, దేవిరెడ్డి సంజీవ్ రెడ్డి, నూనె గురుమహేష్, దేవవరం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - మద్దిపాడు : మండల కేంద్రమైన మద్దిపాడులో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ అంజిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 901 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 869 బేళ్ళు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 32 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.337, అత్యల్ప ధర రూ 205, సరాసరి ధర రూ.278-20 పైసలు పలికింది.

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రానికి కొత్తపాలెం, పెట్లూరు, వర్ధినేనిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,185 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,127 బేళ్ళు అమ్ముడు పోయాయి. వివిధ కారణాలతో 58 బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.336, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.306.04 పైసలు పలికింది.

మాజీ ఎమ్మెల్యే బుర్రాకు మాతృవియోగం

ప్రజాశక్తి- టంగుటూరు

కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి బుర్రా లక్ష్మమ్మ వయోభారంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధ సారధి టంగుటూరు మండలం శివపురం గ్రామానికి వచ్చి బుర్రా లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధుసూదన్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం లక్ష్మమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న మంత్రి పార్ధసారధి

పూర్ణచంద్రరావు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-టంగుటూరు

కామేపల్లి పోలేరమ్మ తిరాణాళ్ల సందర్భంగా జరుగుమల్లి మాజీ జడ్‌పిటిసి దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు శనివారం ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వమించారు. ఈ సందర్భంగా దామచర్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. దేవాలయంలో వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, ఆలయ ఇఒ రావెళ్ళ శివశంకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దామచర్ల పూర్ణ చంద్రరావు

మరో రెండు మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - చీరాల

సరదాగా గడిపేందుకు వచ్చి రామాపురం సముద్ర తీరం వద్ద ఏలూరు జిల్లాకు చెందిన నలుగురు యువకులు గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన వారిలో తేజ (26),కిషోర్ (27) మతదేహాలు శుక్రవారం సముద్రం ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. నితిన్ (26), అమల రాజు (25) మతదేహాలు వాడరేవు వద్ద తీరానికి శనివారం కొట్టుకొచ్చాయి. దీంతో గల్లంతైన నలుగురి మృతదేహాలు లభ్యమయాయి. పోలీసులు మదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అమలరాజు మత్యదేహం



నితిన్ మత్యదేహం

టిడిపిలోని గ్రూపుల మధ్య ఘర్షణ ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి ముండ్లమూరు

టిడిపిలోని ఇరుగ్రూపుల మధ్య చోటు చేసున్న ఘర్షణలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ముండ్లమూరు మండల పరిధిలోని శంకరాపురం-అద్దంకి మండలం తిమ్మాయిపాలెం మధ్యలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... ఓ గ్రూపుకు చెందిన వ్యక్తి ఇటీవల టిడిపిలో చేరాడు. రేషన్ డీలర్లు, ఎన్ఆర్‌జిఎస్ ఫీల్ట్ అసిస్టెంట్ల మార్చే విషయమై ఇటీవల దర్శిలో పంచాయితీ పెట్టారు. అయితే ఇరుగ్రూపుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. చివరకూ ఇరుగ్రూపుల వారు గొడవ పడ్డారు.ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇదే విషయమై శుక్రవారం సాయంత్రం మరోసారి ఘర్షణ పడ్డారు. గ్రామ పెద్దలు ఇరుగ్రూపుల వారికి సర్ది చెప్పి అక్కడ నుంచి పంపించారు. అనంతరం ఇటీవల టిడిపిలో చేరిన వ్యక్తి గ్రూపుకు చెందిన మందలపు శివకష్ణ, మేదరమెట్ల హరికష్ణ, బొమ్మినేని హరికష్ణ, మందలపు గోపికష్ణ, కొర్రపాటి భాను ప్రకాష్ ఘటనా స్థలం వద్ద మద్యం తాగుతున్నారు. అదే సమయంలో మరో గ్రూపుకు చెందిన వారు కార్లు, బైకులపై ఘటనా స్థలం వద్దకు వెళ్లారు. మద్యం తాగుతున్న వారి కళ్లలో కారం కొట్టారు. అనంతరం కర్రలతో దాడి చేశారు. వారికి సంబంధించిన కారును ధ్వంసం చేశారు. ఈ దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో మందలపు శివకష్ణ, మేదరమెట్ల హరికష్ణ పరిస్థితి విషయంగా ఉండటంలో విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. మందలపు గోపికష్ణకు రెండు కాళ్లు, రెండు చేతులు విరగడంతో నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై బాధితులు అద్దంకి పోలీసుస్టేషన్‌లో 40 మందిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు 33 మంది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

ఓ వ్యక్తిపై కొంతమంది దాడిచేసి గాయపరిచిన ఘటన మండల పరిధిలోని ముండ్లపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... ముండ్లపాడు గ్రామానికి గజ్జల కోటిరెడ్డి ఇంటికి శుక్రవారం రాత్రి సమయంలో ఓ కుక్క వచ్చింది. కుక్కను కొట్టే క్రమంలో విరిసిన రాయి ప్రక్క ఇంటిలో పడింది. దీంతో ఆ ఇంటి యజమానులు గుడిపాటి రామిరెడ్డి, లక్ష్మిరెడ్డి తమ ఇంటి పై రాళ్లు వేస్తావా అంటూ కోటిరెడ్డిపై దాడి చేశారు. క్షతగాత్రుడిని పామూరు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పామూరు వైద్యశాల నుంచి వచ్చిన కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోటిరెడ్డికి పరామర్శ

దాడిలో గాయపడిన గజ్జల కోటిరెడ్డిని పామూరు వైద్యశాలలో టిడిపి నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు బొమ్మన బోయినవెంగయ్య, ఎన్‌సి. మాలకొండయ్య, బత్తుల వెంకటాద్రి, అట్లూరి రామకష్ణరాజు, షేక్ షాను, ధనెంకుల నాగరాజు తదితరులు ఉన్నారు.

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-కొమరోలు

బైకును లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఇడమకల్లు గ్రామ సమీపంలో అమరావతి-కడప రాష్ట్ర రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కొమరోలు మండలం బొడ్డువానిపల్లి గ్రామానికి చెందిన కాలే గురవయ్య అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గురవయ్య బైకుపై వస్తుండగా లారీ ఢీకొంది. క్షతగాత్రుడిని స్థానికులు గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంత్రి గొట్టిపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

గొట్టిపాటికి ఎంఎల్ఎల అభినందన


ప్రజాశక్తి - అద్దంకి

విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి రవికుమార్‌ను ఆయన ఛాంబర్‌లో శాసన సభ్యులు జివి ఆంజనేయులు, చింతమనేని ప్రభాకర్, బొజ్జల సుధీరరెడ్డి, ఆదిరెడ్డి శ్రీనివాస్, కూనా రవికుమార్, టిడిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి గొట్టిపాటిని అభినందిస్తున్న నాయకులు

అద్దంకి : విద్యుత్ శాఖ మంత్రిగా శనివారం అమరావతిలోని సచివాలయం రెండవ బ్లాకులో బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌ను తెలుగుదేశం క్లస్టర్ ఇంచార్జిలు, నాయకులు మానం మురళీమోహన్ దాస్, కరి పరమేష్, రాజేంద్ర, దామా సురేంద్ర అభినందనలు తెలిపారు.



విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని రాళ్లపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు జరిగిన పేరెంట్ కమిటీ సమావేశంలో 2024-25 విద్యా సంవత్సరంకు సంబంధించి ఏపీ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో మండలం మొదటి స్థానం వచ్చిన పాలపోగు అక్షయ, పాఠశాల నుంచి దాసరి ఊహ, వడియాల రమ్య అనే విద్యార్థినులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమేపల్లి హనుమంతరావు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.1వెయ్యి, రూ.500, రూ.500 నగదు అందించారు. పేరెంట్ కమిటీ చైర్మన్ దాసరి బుజ్జి, ఉపాధ్యాయులు ఎ శ్రీనివాసరావు, సిఆర్పి ఎం రమేష్ పాల్గొన్నారు.

ముస్లిముల సమస్యలు పరిష్కరిస్తా

ప్రజాశక్తి - మేదరమెట్ల



గొట్టిపాటిని సన్మానిస్తున్న ముస్లిం సోదరులు

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను ప్రకాశం జిల్లా ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘ కార్యదర్శి సర్దార్ ఖాన్, ముస్లిం సోదరులు శనివారం కలిశారు. ఆయనకు శాలువా కప్పి పూల గుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు సాధ్యమైనంత వరకు రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



మంత్రి అనగానితో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో పలు సమస్యలకు సంబంధించిన లేఖలను మంత్రికి అందజేశారు. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించాలని, ముస్లిం సోదరులు జీవనోపాధి పొందేలా ఆటోనగర్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. మార్టూరు, ఇంకొల్లు, పర్చూరు మండల కేంద్రాల్లో ఆటోనగర్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఇంకొల్లు పర్యటనలో ముస్లిం సోదరుల అభ్యున్నతికి ఇంకొల్లు, మార్టూరు, పర్చూరు మండల కేంద్రాల్లో ఆటోనగర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. దీనిపై వేగవంతంగా చర్యలు చేపట్టి మూడు ప్రాంతాల్లో ఆటోనగర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దారు కార్యాలయాల మరమ్మత్తులు చేపట్టి ఆధునికరించాలని కోరారు. దశాబ్దాల క్రితం నిర్మించిన కార్యాలయాలు కావడంతో ప్రస్తుతం వర్షాకాలంలో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. పర్చూరు, మార్టూరు, యద్దన పూడి, కారంచేడు, ఇంకొల్లు, చిన్నగంజాం తహశీల్దారు కార్యాలయాల మరమ్మత్తులు చేపట్టి ఆధునికరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అన్నారు. వాటికి స్థలం కేటాయించి నూతన భవనాలు నిర్మించాలని కోరారు. వీటికి స్పందించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

యువతి హత్యకేసులో నిందితులను శిక్షించాలి

- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి
- గంజాయి, మత్తు పదార్థాలను నిర్మూలించాలి
- అత్యాచారం, హత్యల నివారణకు రక్షణ చేపట్టాలి
- ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి - చీరాల



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

మండలంలోని ఈపూరుపాలెంలో బహిర్భూమికి వెళ్లిన సుచరిత అనే యువతిని అత్యాచారం, హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుండి గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ చేసి మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ సుభాషిని మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా మహిళలపై అత్యా చారాలు, హత్యలు ఆగడం లేదని అన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు విచ్చలవిడిగా ఉపయోగించడం వలన వాటికి బానిసైన యువకులు ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారని అన్నారు. గంజాయి మత్తు పదార్థాలు నియంత్రించకుండా మహిళలపై జరుగుతున్న ఘటనలు నియంత్రించలేరని అన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మత్తు పదార్థాలను నిర్మూలించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించి అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చి 48 గంటల్లో నిందితులను అరెస్టు చేస్తామని భరోసా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఇచ్చిన మాట రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. గత ప్రభుత్వం గంజాయి మత్తు పదార్థాలను నియంత్రించడంలో విఫలమైందని ఆరోపించారు. దాని ప్రతిఫలమే రాష్ట్రంలో మహిళలు, విద్యార్థులపై అత్యాచారాలు, హత్యలు పెరిగాయని అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి వెంటనే కఠినంగా శిక్షలు వేయాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని అన్నారు. సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి కొండయ్య, రజక వృత్తిదారుల జిల్లా కార్యదర్శి పేరాల జనార్ధన్, ఐద్వా జిల్లా నాయకురాలు లక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు భగవాన్ దాస్, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, ప్రసాద్, రాంబాబు, పాల్గొన్నారు.

బాపట్ల : మండలంలోని ఈపురుపాలెంలో యువతిపై అత్యాచారం, హత్యకు కారణమైన ముద్దాయిలను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ కోరారు. న్యాయవాది నటరాజన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హోం మంత్రి వంగలపూడి అనిత సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయం అన్నారు. సమావేశంలో ఎన్ఎస్పి రాజు, మారం రవికుమార్, అంగలకుదురు నటరాజన్, పట్టణ యువజన అధ్యక్షుడు గోపీనాథ్, భాను పాల్గొన్నారు.

రేపల్లె : చీరాల మండలం ఈపురుపాలెం సీతారంపేటకు చెందిన పముజుల సుచరితపై అత్యాచారం చేసి అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను అరెస్టుచేసి ఖఠినంగా శిక్షించాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో కొడాలి రామకోటేశ్వరరావు, జి లక్ష్మీ, కె వీర మోహనరావు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్చాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - చెరుకుపల్లి



ఆరేపల్లిలో నేను బడికి పోతాలో ఎంఈఓ పులి లాజర్

బడి ఈడు పిల్లలందరూ పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ పులి లాజర్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమం మండలంలోని ఆరేపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ పులి లాజర్ మాట్లాడుతూ నూతనంగా అంగన్‌వాడి కేంద్రాల నుండి పాఠశాలకు చేరిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు శనివారం అందజేశారు. ప్రభుత్వం పాఠశాల విద్యకు ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు. వివిధ పథకాల ద్వారా ఉచితంగా పుస్తకాలు, వివిధ రకాలైన కిట్లను అందజేస్తుందని అన్నారు. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకొని విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చూసి విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కాటూరి నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ గోవర్ధన్ పాల్గొన్నారు.



రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దంపతులకు సత్కారం

100 రోజులుగా అన్నదానం

ప్రజాశక్తి - వేటపాలెం

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 23-24 సంవత్సరంలో జాండ్రపేటలోని గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో చేస్తున్న అన్నదానం శనివారం నాటికి 100వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ వేటపాలెం రోటరీ క్లబ్ చేస్తున్న అన్నదాన కార్యక్రమం అభినందనీయమని అన్నారు. అన్నార్తులను ఆదుకోవడం అందరి బాధ్యతని అన్నారు. సమిష్టి కృషితో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని అన్నారు. పందిళ్ళపల్లి జెడ్పి హెచ్ఎస్ పూర్వ విద్యార్థి, సొసైటీ కార్యదర్శి రొండ దశరథ్ మాట్లాడుతూ రోటరీ క్లబ్‌కు ఎంతో గుర్తింపు తెచ్చిన అధ్యక్షుడు బట్ట మోహనరావును ప్రశంసించారు. అసిస్టెంట్ గవర్నర్ దంపతులను, రోటరీ సభ్యులను, విలేకరులను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ సతీమణి రాజేశ్వరి, క్లబ్ అధ్యక్షుడు బట్ట మోహనరావు, కార్యదర్శి ఎవి సురేష్ బాబు, క్లబ్ సభ్యులు కొత్త శ్రీనివాసరావు (వాసు), ఆత్మకూరు సుబ్బారావు, గుత్తి పరంజ్యోతి పాల్గొన్నారు.



రోటరీ ఆధ్వర్యంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి

ఉత్సాహంగా ప్రారంభమైన ఏరువాక

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా కాకానిపాలెం సచివాలయం దగ్గర గల పొలంలో ఏరువాకను చిన్ని మురళీకృష్ణ సౌజన్యంతో శనివారం ఘనంగా నిర్వహించారు. భూమికి, ఎద్దులకు పూజ చేసి నవధాన్యాలు చల్లారు. 8 జతల ఎద్దులతో అరకలు సాగించారు. ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ రోటరీ ప్రతినిధులను అభినందించారు. మనది వ్యవసాయ దేశమని, రైతులేనిదే రాజ్యం లేదని అన్నారు. దేశానికీ రైతే వెన్నెముకని, అలాంటి రైతు ఏరువాక రోజు భూమి పూజ చేసి దుక్కి దున్ని వ్యవసాయం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, మాజీ ప్రెసిడెంట్ సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పుట్టం రాజు శ్రీరామ చంద్రమూర్తి, షేక్ మొహమ్మద్ రఫీ, ఊటుకూరు రామకోటేశ్వరావు, ,పసుపులేటి ఆంజనేయులు, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు, చామర్తి గురుశేఖర్, కూకట్ల సుబ్బారావు పాల్గొన్నారు. ఏరువాక సాగిన రైతులు నరిశెట్టి హనుమంతరావు, నరిశెట్టి కోటేశ్వరరావు, కాకాని హనుమంతరావు, నర్రా సతీష్, జిడ్డి హనుమంతరావు, జిడ్డిసుబ్బారావు, మత్తెం సంజీవ, యరమోతు శ్రీనివాసరావును రోటరీ సభ్యులు శాలువాలతో సత్కరించారు.



ఏరువాక పౌర్ణమి పూజలు

నగరం : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని ఏరువాక పౌర్ణమి సందర్భంగా దేవాలయాల్లో సామూహిక హారతులు నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. మండలంలోని జిల్లేపల్లిలో వేంచేసిన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన సంకీర్తన నిర్వహించి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో హేమ శంకర్రావు, ఆలయ అర్చకులు శానం సౌభాగ్యరావు, వానపల్లి కోటేశ్వరరావు, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

సత్తా చాటిన వేటపాలెం ఎడ్ల జత

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ లోని శీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రాష్ట్రస్థాయిలో రాధాడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 18 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన సాయి భార్గవ్ రెడ్డి ఎడ్ల జత మొదటి స్థానంలో నిలిచాయి. విజేతలకు మూలగుంటపాడు యాదవయూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రూ. 50 వేల నగదు బహుమతిని అందజేశారు. నెల్లూరు జిల్లా అల్లూరు మండలం తూర్పు ఓబులపల్లి చెందిన పల్లెబోయిన సంతోష్ రెడ్డి ఎడ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు చిమటా కిషోర్ రూ.30 వేల నగదును అందజేశారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం కొత్త గొల్లపాలెం చెందిన గోగినేని అశోక్ ఎడ్ల జత తృతీయ స్థానం సాధించాయి. విజేతకు టిడిపి సీనియర్ నాయకుడు, కీర్తిశేషులు చీమకుర్తి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారులు చీమకుర్తి శ్రీకాంత్, చీమకుర్తి కష్ణ రూ.20వేల నగదు బహుమతిని అందజేశారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం కడవకుదురుకు చెందిన మహేశ్వర్ రెడ్డి ఎడ్ల జత నాల్గవ స్థానం సాధించాయి. విజేతలకు పిలిగి సుధాకర్, నక్కా మాలకొండయ్య రూ.15వేల నగదును అందజేశారు. బాపట్ల జిల్లా పోతురాజు కొత్తపాలెంకు చెందిన కావూరి వెంకటేశ్వర రెడ్డి ఎడ్ల జత ఐదో స్థానం సాధించాయి. విజేతలకు శ్రీ హర్ష యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రూ. 12 వేల నగదు బహుమతిని అందజేశారు. అనంతరం ఎడ్ల యజమానులను ఘనంగా సత్కరించారు. రాధాడు పోటీలు చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమాల్లో వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, నక్కా బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు బహుమతులు అందజేస్తున్న దాతలు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ లక్ష్మి

మంత్రి గొట్టిపాటికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా డాక్టర్ గొట్టిపాటి రవికుమార్ సచివాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టారు. అందులో భాగంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, కడియాల రమేష్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొనన హైకోర్టు జడ్జి మన్మధరావు

కార్యకర్తలకు అండగా ఉంటా

వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దాల

ప్రజాశక్తి -కనిగిరి

కార్యకర్తలకు అండగా ఉంటానని వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. స్థానిక కార్యాల యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో దద్దాల మాట్లాడారు. నియోజక వర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, ఎవరూ ఆధైర్య పడద్దని తెలిపారు. ప్రతి మండలంలోని నాయకులందరూ కార్యకర్తలందరికీ అందు బాటులో ఉంటారని ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే వారు నాయకులను సంప్రదించాలని సూచించారు. టిడిపి ప్రభుత్వం చట్ట వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. తాడేపల్లిలో నిర్మాణంలో నున్న వైసిపి కార్యాలయాన్ని తెల్లవారుజామున అక్రమంగా కూల్చివేయటం దుర్మార్గమైన చర్య అని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి కార్యాలయానికి అనుమతులు ఉన్నాయని, కావాలనే కక్షపూరితంగా కూల్చి వేశారని తెలిపారు. .ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కస్తూరి రెడ్డి, ఒమేగా రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి, కటికల వెంకట రత్నం, ఆదినారాయణ రెడ్డి దాదిరెడ్డి మాలకొండారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

మూతపడిన ఆర్‌ఒ ప్లాంట్

తాగునీటి కోసం విద్యార్థుల ఇక్కట్లు

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థుల సౌకర్యార్థం తాళ్లూరు మండలం బొద్దికూర పాడు హైస్కూల్‌లో గతంలో ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు చేశారు. నాడు -నేడు పథకం ద్వారా రూ.5 లక్షల వ్యయంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో ఈ వాటర్ ప్లాంట్ మూతపడింది. దీంతో విద్యార్థులు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. ఈ పాఠశాలో సుమారు 400 మంది విద్యార్థులు ఉన్నారు. వారంతా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాడు-నేడు పథకం ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ కళ్ళముందు అందంగా కనిపిస్తుంది. గ్లాసు నీరు తాగుదామన్నా ఒక్కరోజు కూడా పని చేసిన పాపాన పోలేదు. ఈ వాటర్ ప్లాంట్ పని చేయటం లేదని రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులకు, వాటర్ ప్లాంట్ యాజ మాన్యానికి అనేకసార్లు విన్నవించు కున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఏజెన్సీ వారు, అధికారులు వాటర్ ప్లాంట్‌ను సందర్శించారు. అయినప్పటికీ ఈ ప్లాంట్ పనిచేసిన పాపాన పోలేదు. వాటర్ ప్లాంట్ ఎందుకు పనిచేయడం లేదని అడిగితే ఏవేవో సాకులు చెప్పి వెళ్లిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు కుదరని పక్షంలో ఆ వాటర్ ప్లాంట్‌ను ఏజెన్సీ వారికి అప్పజెపి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు.



మూతపడిన ఆర్‌ఓఓ ప్లాంట్

హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-శింగరాయకొండ : పాత శింగరాయకొండ గ్రామంలోని శ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మధరావు శనివారం సందర్శించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత దేవాదాయ శాఖ అధికారులు మన్మధరావుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం బ్రహ్మోత్సవాల భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ మన్మధరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పామర్తి మాధవరావు, సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఇఒ పి.కష్ణవేణి. ఎస్ఐ టి.శ్రీరామ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- టంగుటూరు : టిడిపి మండల అధ్యక్షుడు కామని విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు కొమ్ము భానుచందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు విజయకుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ళ సురేష్ బాబు, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధన్యాసి బ్రహ్మానందం, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మేడికొండ రవీంద్ర, నాయకులు సుధాకర్, మేడికొండ శ్రీను, సుబ్బారావు, దత్తి ఈశ్వర్, బ్రహ్మయ్య, శ్రీహరి, కొమ్ము శ్రీను ఉన్నారు.

జనసేన బైకు ర్యాలీ

ప్రజాశక్తి -మద్దిపాడు

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భా రాన్ని పురస్కరించుకొని జనసేన పార్టీ వీర మహిళ కకార్లపూడి హరిత ఆధ్వర్యంలో మండల పరిధిలోని లింగంగుంట గ్రామంలో వేసి ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 టెంకాయలు కొట్టారు. తొలుత మద్దిపాడులోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద నుంచి లింగంగుంట గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాల సుబ్రమణ్యం, వెల్లంపల్లి ఎంపిటిసి అద్దేపల్లి దుర్గాభవాని, జనసేన పార్టీ వీర మహిళ అధ్యక్షురాలు కాకర్లపూడి హరిత, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, దమ్ము సురేష్, నాయకులు తిరుమల శెట్టి చిరంజీవి, ఏడుగుండ్ల సత్యనారాయణ, కనుపర్తి శేషయ్య, అయినాబత్తిన నాగేశ్వరరావు, కవల బుజ్జి, శివ శంకర వరప్రసాద్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు

సామాజిక తనిఖీకి సహకరించాలి

విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి

ప్రజాశక్తి - శింగరాయకొండ

మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. అందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం ఎంపిడి నగేష్ కుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి మాట్లాడుతూ చేసిన పనులు చూపించి సామాజిక తనిఖీ సహకరించాలని కోరారు. ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్లు సామాజిక తనిఖీ బందానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ కోటా శ్రీహరి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సామాజిక తనిఖీ బందం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి

'నేను బడికి పోతా' ర్యాలీ

ప్రజాశక్తి-దర్శి : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా తాళ్లూరులో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె. యుగకీర్తి మాట్లాడుతూ బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకరరావు, ప్రిన్సిపల్ కె.ఆంజనేయులు, ఎస్ఐ విజయకుమార్, ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

మత్తు పదార్ధాలకు యువత దూరంగా ఉండాలని మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు అన్నారు. శనివారం పట్టణంలోని జీవనజ్యోతి జూనియర్, డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల యువత గంజాయి తదితర మత్తు పదార్ధాలకు బానిసలవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలతో అనారోగ్యం పాలై జీవితం అంధకారమవుతుందని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రమ శిక్షణతో కూడిన చదువు వలన ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ వైవీ సోమయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: విద్యార్థులు మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలని యర్రగొండపాలెం ఎస్ఈబి సిఐ కె నాగేశ్వరరావు అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని శ్రీ గౌతమి జూనియర్ కాలేజీలో విద్యార్థులకు గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్, మత్తు పానీయాల వలన జరిగే అనర్థాల గురించి వివరించారు.


పొదిలిలో మాట్లాడుతున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు

ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్ధాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ మత్తులో యువత నేడు అనేక నేరాలు చేస్తున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల సేవనం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఎవరికైనా అక్రమ మద్యం తయారీ కానీ, రవాణా గురించి గానీ తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 14500కు లేదా 9440902506కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వై మోహన్, శ్రీ గౌతమి కళాశాల ప్రిన్సిపాల్ త్రిపురారెడ్డి, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి: సమాజంలో రోజురోజుకూ యువతకు ప్రమాదకరంగా మారుతున్న మాదక ద్రవ్యాలు, మత్తు పదార్ధాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా అవగాహన కలిగి ఉండాలని పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి మల్లికార్జునరావు అన్నారు. శనివారం పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎజి కోటయ్య, కళాశాల ప్రిన్సిపాల్ తారావాణి, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సన్మానం చేస్తున్న దృశ్యం

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

విద్యాభివృద్ధికి ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ సుధాకర్‌రావు కృషి అభినందనీయమని వక్తలు కొనియాడారు. స్థానిక పంక్షన్ హాలులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆయన పదవీ విరమణ సన్మాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు బి మస్తాన్ నాయక్, కె తులసి మల్లికార్జుననాయక్, బి రాందాసునాయక్, విశ్రాంత ప్రిన్సిపల్ జీసీ ధర్మనాయక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, ఎంపీపీ గుమ్మా పద్మజ, సర్పంచ్ చిత్తూరి హారిక, ప్రభాకరావు, ఎమ్ నాగేశ్వరరావు, కె శ్రీనివాసులు, ఎమ్ వర్ధన్ పాల్గొన్నారు.


ఇస్లాంపేట దర్గాలో పైపులైన్ వేస్తున్న దృశ్యం

నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం కొమరోలు పంచాయతీలోని ఇస్లాంపేట మాబుసుబాని దర్గా స్ట్రీట్‌లో రెండు నెలలుగా ఉన్న నీటి సమస్యను ఇబ్బంది పడుతున్న ప్రజల సమస్య ముత్తుముల సంజీవరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఇస్లాంపేట దర్గా స్ట్రీట్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన అధికారులు వార్డు మెంబర్ సుభాని పురమాయించి పాడై పోయిన పైపులను తొలగించి వాటి స్థానంలో కొత్త పైపులను అమర్చి కాలనీవాసులకు నీళ్లు వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. ఇంత త్వరగా పైపులైను అమర్చి ఆ కాలనీవాసులు నీళ్లు రావడంతో కాలనీ ప్రజలు ముత్తుముల సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం వ్యక్తిగత కార్యదర్శిని కలిసిన పాకనాటి

ప్రజాశక్తి-త్రిపురాంతకం


పుష్పగుచ్ఛం అందజేస్తున్న గౌతంరాజ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యక్తిగత రాజకీయ సహాయక కార్యదర్శి, మాజీ ఎంఎల్సి, పోలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌ను విజయవాడలోని కేంద్ర టిడిపి కార్యాలయంలో శనివారం యర్రగొండపాలెం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ పాకనాటి గౌతమ్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వీరిద్దరూ కలిసి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ గెలుపు కోసం పని చేశారు. ఈ క్రమంలో పలు అంశాలపై చర్చించుకున్నారు.

కూలి తగ్గింపుపై కూలీల ఆవేదన

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు సంబంధిత ఫీల్డ్ ఆఫీసర్ కూలి రేటు తగ్గించి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ప్రకటించిన మేరకు కూలి ఇవ్వాలని, కూలిని తగ్గించి అతి తక్కువగా మస్టర్ వేస్తున్నావని ఫీల్డ్ ఆఫీసర్‌తో తమ బాధని వ్యక్తపరిచారు. ప్రభుత్వం ప్రకటించిన కూలి ధర రోజుకు రూ.273 కాగా ప్రస్తుతం ఫీల్డ్ ఆఫీసర్ ఇస్తున్న రోజు కూలి రూ.96 మాత్రమే ఇస్తున్నారని, రెక్కలు ముక్కలు వేసి పని చేసుకున్నా సగటు రోజు కూలి రావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల


దోర్నాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాఠశాల విద్యా శాఖ నిర్వహిస్తున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ నాసర్‌రెడ్డి కోరారు. శనివారం పెద్దదోర్నాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాసర్‌రెడ్డి మాట్లాడుతూ 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలు లోపు ఉన్న ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలని అన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యమ్రాన్ని సమన్వయంతో నిర్వహించాలని అన్నారు. దీనికోసం మండల, గ్రామస్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంఈవో బి మస్తాన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని అన్నారు. ఎవరైనా బడి బయట ఉన్న పిల్లలను బడికి పంపించి చదివించాలని కోరారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, గిరిజన గ్రామాలలోనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ డ్రాప్ అవుట్ లేకుండా చూడాలని అన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కొండలరావు, ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

రాచర్ల: స్థానిక ఎంపిడిఓ సమావేశం హాలులో రాచర్ల తహశీల్దారు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం 'నేను బడికి పోతా' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులందరూ మండలం లోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పాఠశాలకు వెళ్లని 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల లోపు బాలబాలికలను గుర్తించి వారిని వారి వయసుకు తగ్గట్టు ఆయా తరగతుల్లో చేర్పించి వారికి విద్యను అందించాలని, ఇందు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఎంఈఓలు శివ కోటేశ్వరరావు, గిరిధరశర్మ, జిల్లా పరిషత్తు, మోడల్ స్కూలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అవగాహన సదస్సు కార్యక్రమం అనంతరం రాచర్ల పురవీధులలో ర్యాలీ నిర్వహించారు.

తర్లుపాడు: భావితరాల భవిష్యత్తుకు పునాది వేయాలంటే విద్యుత్ అనే సాధ్యమవుతుందని, అందుకే బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండేలా గ్రామ అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందని తర్లుపాడు ఎంపీడీవో బి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన "నేను బడికి పోతా" అనే కార్యక్రమాన్ని రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండలంలోని ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు దేవరకొండ సుజాత, ఎ అచ్యుత సుబ్బారావు, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, ఈవోపిఆర్‌డి బాలకృష్ణ ప్రసంగించారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

మంత్రి స్వామిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- యర్రగొండపాలెం: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిని రాజధానిలోని టిడిపి కార్యాలయంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి నాయకులు పరిశపోగు ముసలయ్య, గుంటి రాము శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరిశపోగు ముసలయ్య మంత్రి స్వామితో మాట్లాడుతూ టిడిపి కూటమి విజయ ఢంకా మోగించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయాలని కోరుతూ త్రిపురాంతకం మండలం రామసముద్రం నుంచి నాగార్జున సాగర్ మేరిమాత దేవాలయం వరకు పాదయాత్ర చేసి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు. అలాగే రామసముద్రంలోని చర్చిలో కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజున 101 కొబ్బరికాయలు కొట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ పార్టీకి కష్టకాలంలో వెన్నంటి ఉన్న వారిని ఖచ్చితంగా గుర్తు పెట్టుకుంటామని అన్నారు.

పేద విద్యార్థులకు 'సూర్యశ్రీ' ట్రస్టు అండ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



విద్యార్థికి సాయం అందజేస్తున్న ట్రస్టు వ్యవస్థాపకుడు మురళీకృష్ణ

సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ బాషా ఆధ్వర్యంలో పేద విద్యార్థి అబ్దుల్లా ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుకు అవసరమైన పుస్తకాలు, నోట్ బుక్స్, సైకిల్ ఈరోజు ట్రస్టు కార్యాలయంలో సూర్యశ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ బాగా చదువుతున్న పేద విద్యార్థులకు సూర్యశ్రీ ట్రస్ట్ ఆర్థికంగా అండగా ఉంటుందని తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ నరసరావుపేట చెందిన పేద విద్యార్థి అబ్దుల్లా తండ్రి వాచ్‌మెన్ గా పని చేస్తుండగా తల్లి ఇండ్లలో పాచి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సూర్యశ్రీ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు తెలుసుకొని వచ్చి సహాయం కోరగా ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ స్పందించి ప్రవాస భారతీయుడు శ్రీకాంత్ చౌదరి, సతీష్‌ల సహకారంతో ఈ సాయం అందించారు. చదువుల్లో బాగా రాణిస్తున్న అబ్దుల్లా పదో క్లాసులో 537 మార్కులు సాధించారు. పేద కుటుంబానికి చెందిన అబ్దుల్లాకు ఇంటర్ ఫస్టియర్ పుస్తకాలు నోట్ బుక్స్, కాలేజీ దూరం వల్ల రేంజర్ సైకిల్‌ను దాతల సహకారంతో అందించి మానవత్వం చాటారని అన్నారు. ఈ సేవ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్ పర్సన్ సయ్యద్ షహనాజ్, సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక ఉత్తర బైపాస్ రోడ్డులో శనివారం పారిశుధ్య కార్మికులు చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం జస్వంతరావు పరిశీలించారు. పారిశుధ్యం మెరుగుదల విషయంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆయన వెంట కార్పొరేషన్ ఇంజినీర్ జానీ, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్ పిచ్చయ్య కూడా ఉన్నారు.

ఆర్యవైశ్యుల కృషితో టిడిపి విజయం: గునుపూడి

ప్రజాశక్తి-పొదిలి


గునుపూడి భాస్కర్ దంపతులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చేందుకు ఆర్యవైశ్యులు ఐకమత్యం గా కృషి చేశారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు గునుపూడి భాస్కర్ అన్నారు. శనివారం పొదిలి పట్టణం లోని తన నివాసంలో వాసవీ క్లబ్స్ అధ్వర్యంలో టిడిపి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారు గునుపూడి భాస్కర్–మాధవి దంపతు లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికలలో ఆర్యవైశ్యులు, ఇతర సామాజిక వర్గాలను ఒకే దారిలో నడిపించి మార్కాపురం ఎమ్మెల్యేగా కందుల నారాయణ రెడ్డిని, ఒంగోలు ఎంపిగా మాగుంట శ్రీనివాసులు రెడ్డిలను గెలిపించడంలో కీలకపాత్ర పోషించిన గునుపూడి భాస్కర్ అభినందనీయుడన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ మాట్లాడుతూ అందరూ తన మాటకు విలువనిచ్చి కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిల గెలుపులో భాగస్వాములు అయినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెవెన్ క్లబ్స్, రీజియన్, జిల్లా, రాష్ట్ర నాయకులు అయిన సోమిశెట్టి శ్రీదేవి, సోమిశెట్టి చిరంజీవి, మేడా నరసింహారావు, సాధు ప్రవీణ్, రావూరి ప్రసాద్, పమిడిమర్రు కృష్ణ,మునగ సత్యం, పందిటి మురళి, వొగ్గు వెంకటరామయ్య, సాధు చంద్ర శేఖర్, యాదాల సుబ్బారావు, పందిటి వరలక్ష్మి, పులిపాటి స్రవంతి, తాత రాము, రావూరి సుబ్బారాయుడు, సోమిశెట్టి శ్రీను, పేరం లక్ష్మీ నారాయణ, సామి రాజా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నేతల పరామర్శ



ఘటన స్థలాన్ని పరామర్శిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని ఈపూరిపాలెంలో సుచరిత (21) అనే యువతి అత్యాచారం, హత్య ఘటన సంచలనం రేకెత్తించి. ఈ సందర్భంగా యువతి కుటుంబాన్ని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, మాజీ శాసన సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పోతుల సునీత, దళిత, ప్రజాసంఘాల నేతలు విడివిడిగా శనివారం పరామర్శించారు. యువతిపై జరిగిన ఘటన దారుణం అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే పోలీసులు నిందితులను గుర్తించే పనిలో నిమగ్నం అయ్యారని, అధైర్య పడవద్దని అన్నారు. ముందుగా సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



పాలాభిషేకం చేస్తున్న టిడిపి, జనసేన కార్యకర్తలు

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - పర్చూరు

విదేశీ విద్య పథకాన్ని డాక్టర్ అంబేద్కర్ పేరు తొలగించి తన జేబులో డబ్బులు ఖర్చు పెట్టినట్లు మాజీ సిఎం జగన్ తన పేరు పెట్టుకుని ఆ పథకాన్ని భ్రష్టు పట్టించారని టిడిపి, జనసేన నాయకులు ఆరోపించారు. స్థానిక బొమ్మల సెంటర్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎవి కృష్ణ, ఎన్ కిషోర్ బాబు, సాల్మన్, సుధాకర్, అబ్రహం, గేరా శ్యాం, బి రమేష్, జి ఆనంద్ బాబు, కటారి సురేంద్ర, జి రామలక్ష్మణ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

శాసన సభ్యులు ఎంఎం కొండయ్య డిజిపి అండ్ ప్రిన్సిపల్ హోం సెక్రెటరీ హరీష్ కుమార్ గుప్తను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం సంక్షేమానికి సంకేతం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య జన్మదిన సందర్భంగా నియోజక వర్గంలోని టిడిపి నేతలు నాయకులు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



సముద్ర తీరంలో నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

సముద్రతీరంలో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - వేటపాలెం

సముద్రతీరంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సముద్ర తీరంలోని పొట్టి సుబ్బయ్యపాలెం, కటారిపాలెం, రామాపురం గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా ఉన్నతాధికారులు తీరం వెంట పర్యటించారు. ఆర్‌డిఒ పి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సిఆర్‌జెడ్ పరిధిలోని ఆక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అన్ని నిర్మాణాల యజమానులకు, ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. పొట్టి సుబ్బయ్య పాలెం గ్రామస్తులు రొంపేరు కుడి కాలువ సముద్రంలో కలిసే చోట సీమాక్ ఆక్రమణను అడ్డుకునే ప్రయత్నం లో సదరు ప్రైవేట్ భూమి యజమాని తమపై అక్రమ కేసులు పెట్టి వేధించారని అధికారులకు మొర పెట్టుకు న్నారు. పొల్యూషన్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, ఫారెస్ట్ ఇన్స్పెక్టర్ రేంజర్ వివి రమణారావు, డిఎల్‌పిఒ హనుమం తరావు, ఫిషరీష్ ఎడి బి కృష్ణ కిషోర్, గనుల శాఖ అసి స్టెంట్ జ్యువెలెస్ట్ ఫణి కుమార్, తహశీల్దారు పీ కృష్ణ కాంత్, చల్లారెడ్డిపాలెం కార్యదర్శి కె శివలీల పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షులు వి సాయి కిషోర్ మాట్లాడుతూ 1995లో స్థాపించిన ఫార్మసీ కళాశాల 30 వసంతాలు పూర్తి చేసుకుంది. కళాశాల మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువులను సన్మానిం చుకొని ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. మూడు దశాబ్దాల అనంతరం కళాశాల్లో ఆనాటి విద్యార్థినీ, విద్యార్థులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తమ అనుభ వాలను పంచుకున్నారు. కళాశాల అధ్యా పకులు, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ మూర్తి పాత్ర ఎంతో ఉంద ని కొనియాడారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడంలో ఎల్ల వేళలా ముందు ఉంటామన్నారు. ఇకపై ప్రతి ఏటా పూర్వ విద్యార్థులంతా రానున్న కాలంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉపాధి, ఉద్యోగాల్లో అవగాహన కల్పించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు బొల్లా శ్రీనివాస రావు, సుధాకర్, వై ప్రశాంత్, జి మధుసూదనరావు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దోప్పలపూడి రామ్మోహనరావు, జి దిలీప్ కుమార్, సంయుక్త కార్యదర్శి కె హరిపద్మప్రసాద్, కోశాధికారి తాళ్లూరి రామకృష్ణారావు పాల్గొన్నారు.

పట్టణాన్ని కమ్ముతున్న డంపింగ్ యార్డు పొగ



డంపింగ్ యార్డ్ నుండి వస్తున్న దట్టమైన పొగ

ప్రజాశక్తి - బాపట్ల

మునిసిపల్ డంపింగ్ యార్డులో తగలబడుతున్న చెత్త నుండి వెలువడుతున్న దట్టమైన పొగతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తగలబడుతున్న డంపింగ్ యార్డ్ చెత్త నుండి వెలువడుతున్న పొగ 3, 4, 5, 6, 7వ వార్డులను కమ్మేస్తోంది. వారం రోజులుగా చెత్త నుండి వెలువడుతున్న మంటలను ఆర్పటంలో మునిసిపల్ అధికారులు విఫలమయ్యారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. పొగ దెబ్బకు ప్రజలు అల్లాడుతున్నారు. సుమారు పది ఎకరాల పైచిలు కు డంపింగ్ యార్డ్ మొత్తం చెత్తకు నిప్పు అంటుకుంది. దీన్ని అదుపు చేయటం మునిసిపల్ అధికారుల వల్ల కావడం లేదు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను యుద్ధ ప్రాతిపదికపై నివారించేందుకు ప్రత్యేక చర్యలు అధికారులు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజు రోజుకు పొగ పెరుగుతుంది. ఇదిలా ఉండగా డంపింగ్ యార్డులో మం టలు చెలరేగడంతో పట్టణంలో ఉత్పత్తయ్యే టన్నులకొద్ది చెత్తను ఆ ప్రాంతంలో రోడ్లు వెంటే వేస్తున్నారు.


మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నాం



కమిషనర్ శ్రీకాంత్

డంపింగ్ యార్డులో మంటలు ఆర్పే ప్రయత్నాలు చేస్తున్నాం. మున్సిపల్ డంపింగ్ యార్డుకు ప్రహరీ గోడ నిర్మించాలని అన్నారు. ప్రత్యేకంగా సిబ్బందిని అక్కడ నియమించి మంటలు అదుపు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో మంటలను అదుపు చేసి పొగ బాధల నుండి ప్రజలను కాపాడతాం.

శింగరకొండ దేవస్థానం వరకు పాదయాత్ర



సింగరకొండకు కాలినడకన వెళుతున్న టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్రంలో టిడిపి భారీ మెజారిటీతో గెలవడం, అద్దంకి శాసన సభ్యునిగా గొట్టిపాటి రవికుమార్ వరుసగా ఐదో సారి విజయం సాధించి విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో టిడిపి వర్గీయుల్లో ఆనందం వెల్లివెరిసింది. ముప్పవరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు సింగరకొండ దేవస్థానం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ కుమారుడు గొట్టిపాటి హర్షవర్ధన్ టిడిపి కార్యకర్తలను అభినందించారు. కుక్కపల్లి ఎడుకొండలు, రావూరి రమేష్ బాబు, మాజీ డైరీ ఛైర్మన్ బాలిన రామసుబ్బారావు, చింతల సహదేవుడు, మాజీ జడ్పిటిసి కుక్కపల్లి పద్మ, అల్లం నేని పద్మ, దాసరి అనసూయమ్మ, రుక్మిణమ్మ, గరిమిడి జగన్మోహనరావు, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, వలపర్ల సుబ్బారావు, దాసరి హనుమంతరావు గౌడ్, రేణింగవరం మాజీ సర్పంచ్ అమర్లపూడి ఏసోబు, ఎల్లాల నాగిరెడ్డి, బైట మంజులూరు మాజీ సర్పంచ్ శివరాజు, గొట్టిపాటి కాజా స్వామి, నార్నె శ్రీను, గుదిబండ్ల చిన్ననాగిరెడ్డి, జాగర్లమూడి శ్రీనివాసరావు, దూళిపాళ్ల శ్రీనివాసరావు, కోమటి ప్రసాద్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గ్రేస్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని పెరవలిపాలెం గ్రామానికి చెందిన తాడికొండ గోపి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతి సమాచారం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెం రాజు మృతుని కుటుంబానికి తన వ్యక్తిగత సహాయంగా రూ.5వేలు మట్టి ఖర్చులు నిమిత్తం తన ఫౌండేషన్ సభ్యులతో అందజేశారు. గోపి కుటుంబానికి గ్రేస్ ఫౌండేషన్ అండగ ఉంటుందని భరోసా ఇచ్చారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని విజయనగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శాసన సభ్యులు కొండయ్య పుట్టినరోజు సందర్భంగా పుస్తకాలు పంపిణీ చేశారు. అన్ని రకాల వసతులతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చిన్నారులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని అన్నారు. విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ కె సురేష్ బాబు, నిర్మల, నరేంద్ర, మదన్, నాశన మణి, మోహన్ గౌడ్, విజయ్ పాల్గొన్నారు.

ఇసుక డంపును పరిశీలించిన ఆర్డీవో

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను గతంలో పనిచేసిన తహశీల్దార్ మహమ్మద్ నయుం అహమ్మద్ సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంపును ఒంగోలు ఆర్డీఒ సుబ్బారెడ్డి, మైనింగ్ ఎడి వీరేష్, మైనింగ్ ఆర్ఐ మురళీకృష్ణ, సబ్బు సీఐ బి సుందరరామయ్య శనివారం పరిశీలించారు. సీజ్ చేసిన ఇసుకపై ఎటువంటి రికార్డు లేకపోవడంతో రికార్డు రాసి తహశీల్దారు కార్యాలయానికి స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇసుకను వేలం నిర్వహిస్తామని ఆర్డీఒ సుబ్బారెడ్డి తెలిపారు. తహశీల్దారు జె మధుబాబు, డిప్యూటీ తహశీల్దారు జి పుల్లారెడ్డి, విఆర్ఒ రమణ, సుశీల రాణి పాల్గొన్నారు.

ఎస్‌సి గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5నుండి 9వ తరగతుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ, బీసీ - సీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె కోటేశ్వరరావు శనివారం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28న ఉదయం 10నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు హాజరై అభ్యర్థులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్ నకళ్ళను తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8500066430 నంబర్లో సంప్రదించాలని కోరారు.

డయేరియా వ్యాప్తిని అరికట్టాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డయేరియా వ్యాధి వ్యాప్తిని బాపట్ల జిల్లాలో పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా కోరారు. డయేరియా వ్యాధి నిర్మూలనపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్త చర్యలతోనే డయేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టగలమని చెప్పారు. కలుషిత నీరు తాగకుండా ప్రజలకు అవగాహన కల్పించడమే ముఖ్యమన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు నెల చివరి వరకు డయేరియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జడ్పీ డిప్యూటీ సిఈఓ మోహన్ రావు, డిపిఓ రవికుమార్, డిఈఓ నారాయణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



దామచర్లను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

'దామచర్ల'కు గజమాలతో స్వాగతం

ప్రజాశక్తి-మద్దిపాడు

టిడిపి మండల అధ్యక్షులు మండవ జయత్ బాబు, తెలుగు యువత చుండూరి రఘురామ్ ఆద్వర్యంలో ఒంగోలు శాసనసభ్యులుగా రెండోసారి ప్రమాణస్వీకారం చేసి మొదటగా జిల్లాకి విచ్చేయుచున్న దామచర్ల జనార్ధన్‌కి శనివారం ఘనస్వాగతం పలికారు. గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ వద్ద నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మల సుధాకర్, పోకూరి శ్రీనివాసరావు, తుమ్మల హరిబాబు, ప్రధాన కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య, క్లస్టర్ ఇంచార్జ్ దేవభక్తుని ప్రసాదరావు, పాటిబండ్ల అజయ్ కుమార్, వెల్లంపల్లి ఎంపీటీసీ అద్దేపల్లి భవాని, మండవ గోపీచంద్ పాల్గొన్నారు.

24 నుంచి మీకోసం కార్యక్రమం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఈనెల 24 నుంచి మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. మీకోసం కార్యక్రమంలో జిల్లాలోని ప్రజల నుంచి వివిధ సమస్యలను సంబంధించిన అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లా అధికారులందరూ ఈ నెల 24న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో సిపిఎం బాపట్ల జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి, జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడారు. సిపిఎం జెండాను ఆవిష్కరించారు. వర్తమాన రాజకీయ పరిస్థితులపై సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మణిలాల్ వివరించారు. టి.కృష్ణ మోహన్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. జిల్లా నాయకులు కొండయ్య, బాబురావు, వసంతరావు పాల్గొన్నారు.



సిపిఎం జెండాను ఆవిష్కరిస్తున్న గంగయ్య

ఫీజుల వివరాలు

నోటీసు బోర్డులో పెట్టించండి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఫీజుల వివరాలు నోటీసు బోర్డులు పెట్టించేలా జిల్లా విద్యా శాఖాధికారి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైందని, విద్యా హక్కు చట్టాన్ని ప్రకాశం జిల్లాలో అమలు పరచడంలో జిల్లా విద్యాశాఖ అధికారులందరూ వైఫల్యం చెందినట్లుగా కనిపిస్తుందన్నారు. ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నారని, పుస్తకాలను అమ్ముతున్నారన్నారు. నచ్చిన పేర్లను బోర్డులపై ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ఆ విద్యా సంస్థలో ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో బహిరంగంగా ప్రకటించాలన్నారు. ఒంగోలు నగరంలో ఎన్నడూ లేని విధంగా అకాడమీలు పుట్టుకొచ్చి కొత్త రకం దోపిడీకి పూనుకుంటున్నాయని, వీటిపై విద్యార్థి సంఘాలు, పత్రికలు ఈ సమస్యను గుర్తించి వెలుగులోకి తీసుకొస్తున్నా అధికారులకు మాత్రం ఎందుకు కనబడటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు అన్ని విద్యాసంస్థలలో ప్రత్యక్షంగా పర్యటించి, ఫీజుల వివరాలు నోటీసు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే భవిష్యత్తు ఆందోళనలను దిగుతామని హెచ్చరించారు.



యువతి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

బాధిత కుటుంబానికి సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-చీరాల

చీరాల మండలం ఈపురుపాలెంలో హత్యాచారానికి గురైన యువతి సుచరిత కుటుంబాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య శనివారం పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హత్యకు కారణమైన ముద్దాయిలను వెంటనే అరెస్టు చేయాలన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడినటువంటి యువత ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి ఘటనలపై సమగ్ర విచారణ జరిపి ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. వీరి వెంట సిపిఎం నాయకులు ఎన్ బాబురావు, జిల్లా నాయకులు పి కొండయ్య, ఐద్వా నాయకులు టి సుభాషిని ఉన్నారు.

ఇక పాలనపై దృష్టి

ఎన్నికల పర్వం ముగిసింది. నూతనంగా శాసనసభ్యులుగా ఎన్నికయిన వారు, మంత్రులుగా ఎంపికయిన వారు ప్రమాణస్వీకారాలు చేశారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా డోలా బాలవీరాంజనేయ స్వామి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తమ శాఖల భాధ్యతలను చేపట్టారు. ఇక పాలనా వ్యవహారాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. ప్రధానంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కానీ గత కొన్నేళ్ళుగా పంట కాల్వలు, మురుగుకాలువల సక్రమ మరమ్మతుల గురించి పట్టించుకున్న పరిస్థితి లేదు. దీంతో కాలువ చివరి భూములకు సాగునీరు రాక, తుపానులు, భారీ వర్షాల సమయంలో మురుగునీరు దిగువక వెళ్లే వీలులేక రైతులు నష్టపోతూ వచ్చారు. తక్షణమే కాలువల్లో పూడికలు తీయాలి. సకాలంలో పంటల సాగు జరిగేలా ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ఇరిగేషన్, డ్రైనేజి శాఖల అధికారులు ప్రతిపాదనలు రూపొందించి పంపారు. ఇందుకు కావలసిన నిధులను వెంటనే విడుదల చేసి రైతుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. బాపట్ల జిల్లా పరిధిలోని పంట కాల్వల మరమ్మత్తు పనులకు రూ.13.43 కోట్ల నిధులు అవసరం ఉంది. మురుగుకాలువ మరమ్మతులకు కూడా మరో రూ.12 కోట్ల నిధులు అవసరం ఉంది. జులై నుంచి పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతారు. రైతుల అవసరాల మేరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి. పంటల సాగుకు అవసరమైన సాగునీరు కాలువలకు ఎప్పుడు విడుదల చేస్తారనే విషయమై స్పష్టత లేదు.



స్నేహితులతో సరదాగా సముద్రతీరంలో గడిపేందుకు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న యువకులు, విద్యార్థులు అలల తాకిడికి లోపలికి కొట్టుకుపోయి అర్ధాంతరంగా తనువు చాలిస్తున్న ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. శుక్రవారం ఏలూరు జిల్లా దుగ్గిరాల కి చెందిన యువకులు సరదాగా గడిపేందుకు రామాపురం సముద్రతీరానికి వచ్చారు. వీరిలో నలుగురు యువకులు సముద్రంలో మునిగి మరణించారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారు అవగాహన లేక సముద్రతీరంలో రీసార్టుల ఎదురుగా లేదా జనసంచారం లేని చోట సముద్రస్నానానికి వెళ్ళి మరణిస్తున్నారు. సముద్రతీరం అంతటా మొబైల్ గస్తీ బృందాలతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రీసార్ట్‌ల యాజమాన్యాలు కూడా తమ వద్దకు వస్తున్న పర్యాటకుల కోసం తగిన ముందుజాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

బాపట్ల జిల్లాలోని చీరాల మండలం, ఈపూరుపాలెంలో యువతి దారుణ హత్యకు గురైన ఘటన కలకలాన్ని రేపింది. వేకువజామున బహిర్భూమికి వెళ్లిన 21 ఏళ్ల యువతి సుచరితపై గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారానికి పాల్పడి హతమార్చారు. హోం మంత్రి అనిత యువతి కుటుంబాన్ని పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ఎమ్మెల్యే కొండయ్య ద్వారా ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కేసులో నిందితులను పోలీసులు శనివారం పట్టుకున్నట్లు సమాచారం.

వ్యవసాయంలో వచ్చిన మార్పుల వల్ల యంత్రాలు వాడకం పెరిగి వ్యవసాయరంగంలో పని దినాలు తగ్గిపోతున్నాయి. అన్ని రంగాల లోనూ యంత్రాల వినియోగం పెరిగిపోయిన నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ ద్వారా గ్రామీణప్రాంత పేద,బలహీనవర్గాల ఎక్కువ రోజులు పని కల్పించాల్సి ఉంది. చేసిన పనికి కూడా సక్రమంగా ఉపాధి హామీ కూలీలకు వేతనాలు రావడం లేదు. ప్రస్తుతం 6 వారాల నుండి వేతనాలు రాకపోవడంతో వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు రెండు పూటలా మస్టర్ విధానం వల్ల రోజుకి కనీసం 10 కిలోమీటర్లు నడవలసి వస్తుంది. ఈ పద్ధతి చాలా కష్టంగా ఉందని, దీన్ని రద్దు చేయాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు. చట్ట ప్రకారం పని చేసిన 2 వారాల లోపు ఉపాధి వేతనాలు ఇవ్వాలి. కానీ పని చేసి 6 వారాలు గడుస్తున్నా వేతనాలు విడుదల కావడం లేదు. పనులు లేక ఎండల్లో ఇలా ఉపాధి కూలీలుగా వస్తున్న వారందరూ ఏ రోజు కారోజు ఎంతో కొంత సంపాదించుకుంటే తప్ప ఇల్లు గడవని పరిస్థితి ఉంది. అలాంటిది వారాల తరబడి వేతనాలు రాక వారు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఉపాధి హామీ వేతనాలు చెల్లించాల్సి ఉంది. గతంలో ఇచ్చినట్లుగా పనుల కోసం పలుగు, పారలకు నగదు ఇవ్వాలి. మెడికల్ కిట్స్ ఇవ్వాలి. మేట్ లకు ఇచ్చే పారితోషికం, సమ్మర్ అలవెన్స్‌లను పునరుద్ధరించాల్సి ఉంది.


- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

తాగునీటి సమస్య పట్టదా.?

- పట్టించుకోనిపాలకవర్గం - సరఫరా బాధ్యతల నుంచి చేతులెత్తేసిన అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలుకు తాగునీటిని అందించేందుకు రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు ఉన్నాయి. ఈ రెండు చెరువుల్లో శనివారం నాటికి 72 శాతం తాగునీరు అందుబాటులో ఉంది. ఆ నీటిని ఓవర్ హెడ్ ట్యాంకులకు చేర్చి నిర్ధిష్ట సమయంలో ప్రజలకు తాగునీటిని అందించాలి. అయితే గత రెండు మాసాలుగా ఇది జరగడం లేదు. దాదాపు నెలన్నర పాటు ఎన్నికలు, కౌంటింగ్ అంటూ కాలక్షేపం చేశారు. ప్రజలను కష్టాల్లోకి నెట్టారు. మండు వేసవిలో చుక్కలు చూపించారు. నీరు లేదని, కరెంటు లేదని సాకులు చెప్పి ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అన్నీ పుష్కలంగా ఉన్నాయి. సాగర్‌నీరు ఇటీవలే చెరువులకు చేరింది. నీరు 72 శాతం చెరువుల్లో అందుబాటులో ఉంది. అయినా షెడ్యూల్ ప్రకారం నీరు ప్రజలకు చేరడం లేదు. చెరువుల్లో సంవృద్ధిగా నీరున్నా అది ప్రజలకు చేర్చేందుకు సరైన ప్రణాళిక లేక నగరంలో నీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సమ్మర్‌స్టోరేజి ట్యాంకుకు వస్తున్న సాగర్ నీరు

నగరంలోని గాంధీనగర్ ప్రాంతానికి పోయిన సోమవారం నీరు ఇచ్చారు. మంగళ, బుధవారాలు మినహాయిస్తే గురువారం వారికి తిరిగి నీరు ఇవ్వాలి. శుక్రవారం, శనివారం నాటికి కూడా నీరు ఇవ్వలేదు. ఆదివారం ఉదయం ఇస్తామని సిబ్బంది సమాధానం చెబుతున్నారు. అంటే మూడు రోజులకోసారి ఇచ్చే నీటిని కూడా ఏ రోజు ఇస్తారో చెప్పలేని పరిస్థితి. నాలుగు రోజులు, ఐదు రోజులు, ఆరు రోజులు, వారం రోజులు అంటూ నగరంలో ఓ నిర్ధిష్ట విధానం లేకుండా పోయింది. నగరమంతా ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

నీటి సరఫరా విషయాన్ని నగరపాలక సంస్థ మేయర్, పాలకవర్గం పట్టించుకోవడం లేదు. ఎన్నికల పేరుతో కార్పొరేటర్లు ప్రజల సమస్యలను గాలికి వదిలేశారు. మూడు మాసాలుగా కౌన్సిల్ సమావేశం లేకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు దీని మీద ప్రత్యక్షంగా పాలకవర్గాన్ని నిలదీసే పరిస్థితి లేదు. నీటి సరఫరాను గాడిలో పెట్టాల్సింది అధికార యంత్రాంగం. ఈ విషయంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని నగరంలో నీటి సరఫరా పరిస్థితి చూస్తే అర్ధమవుతోంది. కమిషనర్‌కు నగరం మీద అవగాహన లేదు. నీటి సరఫరాలో ఇంజినీరింగ్ విభాగం కీలకం. ఈ సెక్షన్‌కు రెగ్యులర్ ఇంజినీర్ లేరు. ఇంజినీర్లను సమన్వయం చేసే పరిస్థితి లేదు. కేవలం ట్యాప్ ఇన్స్‌పెక్టర్, ఫిట్టర్‌ల మీద సరఫరా బాధ్యతను వదిలేయడంతో వారు ప్రజలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే నగరంలో మూడు రోజలకోసారి నీటి సరఫరా అనే షెడ్యూలే సక్రమంగా అమలు కావడం లేదు. వారి ఇష్టానికి ఇస్తున్నారు. ఇచ్చే రోజు కూడా సమయపాలన ఉండటం లేదు. అర్ధరాత్రులు, అపరాత్రులు జనం నీటి కోసం ఎదురు చూస్తున్నారు. పగలైతే పనులు మానుకొని నీటి కోసం కాసుకు కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది. కూలీనాలీ చేసుకునే ప్రజలకు ఇది చాలా ఇబ్బందిగా మారింది. పనులు మానుకొని నీటి కోసం ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అయినా నీరు ఎప్పుడిస్తారో తెలియక అల్లాడిపోతున్నారు.

ఆస్తి పన్ను, నీటి పన్ను, చెత్త పన్ను అంటూ ప్రజల నుంచి ఠంచన్‌గా డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రజలకు గుక్కెడు నీళ్లు ఇచ్చే విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రజాసంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అయినా నగరంలో గాడితప్పిన తాగునీటి వ్యవస్థ మీద దృష్టి పెట్టి ప్రజలను తాగునీటి సమస్య నుంచి బయటపడేయాలని నగర వాసులు కోరుతున్నారు.